ఫ్రీ బస్సుల్లో మహిళలపై చిన్నచూపు!

- పథకంలోనే దర్పం.. ఆడబిడ్డలకు దక్కని గౌరవం
- నాడు బస్సుల్లో స్త్రీలను గౌరవించే సంప్రదాయం
- నేడు ఫ్రీగా వెళ్తున్నారని మారిన వైఖరి
- చెయ్యి ఎత్తిన చోట దూరంగా ఆపుతున్న వైనం
- కొన్నిచోట్ల ఆపకుండానే ముందుకు పయనం
- ఇబ్బందులు పడుతున్న మహిళలు

పెద్దపల్లి, మే 27(నమస్తే తెలంగాణ): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు గౌరవం కరువైంది. బస్సెక్కిన దగ్గరి నుంచి దిగే దాకా ఆత్మనూన్యతా భావమే ఎదురవుతున్నది. కాంగ్రెస్ సర్కారు మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యాన్ని కొద్దిరోజులుగా అమలు చేస్తుండగా, 'పథకంలోనే దర్పం.. బస్సుల్లో తమకు గౌరవం ఏదని' మహిళా లోకం ప్రశ్నిస్తున్నది. ఫ్రీగా వెళ్తున్నామని ఆర్టీసీ సిబ్బంది తమను చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నది. ఇదిలా ఉంటే.. ఎప్పుడైతే రాష్ట్ర సర్కారు మహిళలకు బస్సులో ఫ్రీ ప్రయాణం కల్పించిందో..? అప్పటి నుంచి డ్రైవర్లు, కండక్టర్ల వైఖరి పూర్తిగా మారిపోయింది. ఉచితంగా ప్రయాణిస్తున్నారని స్త్రీలను చులకనగా చూడడం, చెయ్యి ఎత్తిన చోట కాకుండా కాస్త ముందుకెళ్లి ఆపడం.. కొన్నిచోట్లయితే ఆపకుండానే వెళ్లడం జరుగుతున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో బస్సుల్లో ప్రయాణించే మహిళలకు మంచి గౌరవం లభించేది. అన్ని వసతులు ఉండేవి. ప్రత్యేకంగా సీట్లు కూడా కేటాయించే వారు. ఇక బీఆర్ఎస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత 'ఎక్కడ చెయ్యి ఎత్తితే.. అక్కడ బస్సు ఆపుతాం' అనే కార్యక్రమాన్ని అమలు చేయడంతో ప్రయాణికులకు ఎంతో మేలు జరిగింది. కానీ, గతేడాది తెలంగాణలో బీఆర్ఎస్ సర్కారు దిగిపోయి కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రాగానే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. అప్పటి వరకూ ప్రశాంత ప్రయాణం కాస్తా ఉచిత బస్సుతో చెదిరిపోయింది. బస్సుల్లో గొడవలు, లొల్లులు, జుట్లు కొని కొట్టుకోవడం, సీట్ల పంచాయితీ ముందుకొచ్చింది. ప్రయాణికులు పెరిగినా.. అందుకు అనుగుణంగా బస్సు సర్వీసులను పెంచలేదు. అదే విధంగా గతంలో ఉన్న అనేక బస్సు రూట్లను పూర్తిగా తగ్గించారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం చేస్తున్నారని మహిళలను సిబ్బంది చిన్నచూపు చూస్తున్నారని, బస్సు ఎక్కే టైంలో, దిగే టైంలో, ఆపే సమయంలో చాలా అమర్యాదగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో రోడ్డుపై ఎక్కడ జనం కనిపించినా బస్సు ఆపిన ఆర్టీసీ డ్రైవర్లు.. ఇప్పుడు మహిళలు స్టేజీ దగ్గర ఉంటే.. స్టేజీ దాటిన తర్వాత చాలా దూరంలో ఆపుతున్నారనే విమర్శలున్నాయి. ''గతంలో బస్సుల్లో 'మహిళలను గౌరవిద్దాం.. వారికి కేటాయించిన సీట్లల్లో వారినే కూర్చోనిద్దాం'' అనే నినాదం ఉండేది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారింది' అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ బోర్డు ఉండే స్థలంలో ఇప్పుడు 'డ్యూటీలో ఉన్న బస్సు సిబ్బందిపై దాడి చేయడం నేరం.. అట్టి వారిపై ఐపీసీ సెక్షన్ 353ప్రకారం రెండేళ్ల కారాగార శిక్ష, జరిమానా విధించబడును' అనే బోర్డులు దర్శనమిస్తున్నాయని చెబుతున్నారు. 'ఉచిత బస్సును ఎవరు అడిగిన్రు? మాకు ఆర్టీసీని ఎందుకు దూరం చేస్తున్నరు? మా ఆత్మాభిమానం దెబ్బతినేలా ఎందుకు ప్రవర్తిస్తున్నారు?' అని మండిపడుతున్నారు.

ఎక్కడి ఇసుక దొంగలు అక్కడే

దందాకు బ్రేక్ వేసిన 'నమస్తే తెలంగాణ కథనం'

- అన్ని వర్గాల్లోనూ జోరుగా చర్చ
- 'అక్రమ రవాణా' వద్దంటూ సంకేతాలు!
- ఇండ్లకే పరిమితమైన ట్రాక్టర్లు.. వినిపించని 'రయ్.. రయ్' శబ్దాలు
- ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లని విషయం!

ఇసుక దందాపై 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన ప్రత్యేక కథనం

కొన్నాళ్లుగా పగలూ.. రాత్రి అనే తేడా లేకుండా జోరుగా సాగిన జమ్మికుంట డివిజన్‌లో ఇసుక దందాకు బ్రేక్‌పడింది. 'మానేరును తోడేస్తున్నరు' అనే శీర్షికన సోమవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనం సంచలనం సృష్టించింది. దందా ఆపకపోతే ఉన్నతాధికారుల దాకా వెళ్లే ప్రమాదముందని ఓ వర్గం అధికారులు, సిబ్బంది సంకేతాలు ఇచ్చినట్టు తెలుస్తుండగా.. అక్రమ రవాణా ఒక్కసారిగా నిలిచిపోయింది. 'ఎక్కడి దొంగలు అక్కడే.. అన్నట్టుగా ఒక్క ట్రాక్టర్ కూడా రోడ్డెక్కకపోగా, అంతా నిశ్శబ్ద వాతావరణం చోటు చేసుకున్నది. ఓ వర్గానికి చెందిన ఉద్యోగులు కాళ్లు కాలిన పిల్లుల్లా పరేషాన్ అవుతున్నట్లు తెలుస్తుండగా, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా కప్పి పెడుతున్నట్టు చర్చ సాగుతున్నది.

జమ్మికుంట, మే 27: జమ్మికుంట డివిజన్‌లో కొన్నేళ్లుగా ఇసుక దందా జోరుగా నడుస్తున్నది. అధికారులను మచ్చిక చేసుకోవడం, ఆపై మానేరువాగు నుంచి అక్రమ రవాణా చేయడం ఆనవాయితీగా సాగుతున్నది. కొత్తగా వచ్చిన అధికారులు ఇసుకాసురులపై కొరడా ఝుళిపిస్తారు. కేసులు నమోదు చేస్తారు. ఆ తర్వాత షరా 'మామూలే'! దీన్నే ఆసరాగా చేసుకున్న ఇసుక మాఫియాకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నది. అధికారులు వచ్చిన కొత్తలో కొంత భయం కనిపించినా.. కొద్ది రోజులకు దందా యథాతథంగా నడుస్తున్నది. ఇసుక అక్రమార్కులు మానేరువాగను తోడేస్తూ.. అక్రమంగా రవాణా చేస్తున్నారు. అయితే ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిప్పుడు.. మీడియాలో వార్తా కథనాలు వచ్చినప్పుడు అలా రెండు, మూడు రోజులు ట్రాక్టర్లు రోడ్డెక్కకుండా జాగ్రత్త పడతారు. ఆ తర్వాత మళ్లీ స్టార్ట్ చేస్తారు. ఇది ఎప్పుడూ జరుగుతూనే ఉన్నది. ఈ నెల 25న ఏకంగా మడిపల్లి గ్రామస్తులు తిరగబడడం, ఆ ఒక్క రోజు కొద్ది సమయంలోనే 20కి పైగా ట్రాక్టర్లను అడ్డుకోవడం చూస్తే దందా ఏ తీరుగా జరుగుతున్నదో అర్థమవుతుంది. అయితే ఇంత పెద్ద ఎత్తున దందా జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్ శాఖ ఎందుకు అడ్డుకోలేకపోతున్నదనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. ఇక సంబంధిత శాఖ మైనింగ్ అండ్ జియాలజీ జాడ పత్తా లేకపోవడంపైనా విమర్శలు వస్తున్నాయి.

సీపీ నజర్ వేస్తేనే..

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సీపీ అభిషేక్ మహంతి కరీంనగర్ జిల్లాకు వచ్చారు. అప్పటి నుంచి పోలీస్ డిపార్ట్‌మెంట్‌తో పాటు ఇతర శాఖలు, అన్ని వర్గాల్లో ఒక రకమైన భయాన్ని సృష్టించారు. ఇసుక అక్రమ రవాణాతోపాటు వేరే ఇతర అసాంఘిక కార్యాకలాపాలను సాగనీయకుండా తనదైన శైలిలో అడ్డుకట్ట వేశారు. ఇదే సమయంలో ఇక్కడి ఏరియాలో బియ్యం, ఇసుక దందాకు చెక్ పడింది. ప్రతీది ఆయనే స్వయంగా పర్యవేక్షించారనే ప్రచారం సాగింది. ఇటీవల ఎన్నికల కోడ్.. తదితర అంశాలు ఏవైనా కానీ, సీపీ బిజీలో ఉండడం కొన్ని వర్గాలకు లాభించింది. ఇంకేముందీ అక్రమార్కులు మళ్లీ రెచ్చిపోవడం కనిపిస్తున్నది. ఇసుకతోపాటు ఈప్రాంతంలో బియ్యం దందా కూడా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నది. గతంలోలాగా సీపీ జమ్మికుంట వైపు నజర్ వేయాలని, అక్రమ దందాలపై కొరఢా ఝుళిపించాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది.

రెండు రోజుల్నుంచి ఏ లొల్లి లేదు..

ఎక్కడి నుంచి అత్తున్నయో తెల్తలేదు. మా ఊళ్లెకెల్లే వందల ట్రాక్టర్లు పోయేటియి. ఒక్కటే కొట్టుడు. స్టీరింగ్ ఇడిసిపెట్టి తోలెటోళ్లు. రేసింగ్ లెక్క నడిపించేటోళ్లు. కట్ కొట్టేటోళ్లు. భయం.. భయంగా మేం రోడ్ల మీద తిరిగెటోళ్లం. శనివారం ట్రాక్టర్లను ఆపినం. పోలీసులకు చెప్పుకున్నం. ఏం జరిగిందో తెలియదు. రెండు రోజుల సంది ఏ లొల్లి లేదు. ఇప్పుడైతే ప్రశాంతంగా ఉంటున్నం. ఏ బాధా లేదు.

- సదానందం, మడిపల్లి గ్రామస్తుడు

ఓడిపోతారని తెలిసే జీవన్‌రెడ్డి విమర్శలు

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మారుతీనగర్, మే 27 : ఓడిపోతారని తెలిసే ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్నారని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మండిపడ్డారు. మెట్‌పల్లి పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవన్‌రెడ్డిని పలుసార్లు ఎన్నికల్లో ప్రజలు తిరస్కరిస్తున్నా పదవుల కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. సభ్యత, సంస్కారం నేర్పాల్సిన పెద్దమనిషి సంస్కార హీనుడిలా ప్రవర్తిస్తున్నారని, కేటీఆర్‌పై ఇష్టంవచ్చినట్లు సంభోదించడం సరికాదని హితవుపలికారు. కాంగ్రెస్ సిద్ధాంతాలు లేని పార్టీ అని, బీఆర్ఎస్ అంటే సిద్ధాంతాలున్న పార్టీ అన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలని సూచించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్లలో ఎవరిపై ఎవరు గెలిచారో జీవన్‌రెడ్డికి తెలియకపోవడం విడ్డూరంగా ఉందని, బీజేపీ, బీఆర్ఎస్ కలిసిపోయాయి అనడం ఆయన విజ్ఞతకే తెలియాలని మండిపడ్డారు. తడిసిన ధాన్యాన్ని ఏ ప్రభుత్వం వచ్చినా కొనుగోలు చేయలేదనడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో తడిసిన వరిధాన్యాన్ని కొనుగోలు చేసిన ఘనత ఉందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలువడం ఖాయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేస్తున్న అభివృద్ధి పనులను రైతులతోపాటు యువత గమనిస్తున్నారని, ఆ పార్టీకి రోజుల దగ్గరపడ్డాయని విమర్శించారు. అడగకుండానే వరాలిచ్చే కేసీఆర్ పేదలకు, రైతులకు వివిధ రకాల సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. అమలుకు నోచుకోలేని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రానున్న కాలంలో కాంగ్రెస్ స్కామ్‌లు, స్కీములు మొదలవుతాయని, ప్రజలు కాంగ్రెస్ నాయకులకు గట్టి గుణపాఠం చెబుతారన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ ఉపాధ్యక్షురాలు రాణవేని సుజాత, మెట్‌పల్లి ఎంపీపీ మారు సాయిరెడ్డి పాల్గొన్నారు.

మురుగు కాలువలో నవజాత శిశువు

మారుతీనగర్, మే 27 : మురుగు కాలువలో నవజాత శిశువును పడవేసిన అమానవీయమైన ఘటన మెట్‌పల్లి పట్టణంలో సోమవారం వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అంబేద్కర్ స్టేడియం వద్ద మురుగు కాలువలో నవజాత శిశువు మృతదేహం స్థానికులకు కనబడింది. అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు పోలీసులతో కలిసి అక్కడకు చేరుకొని శిశువు మృతదేహాన్ని బయటకు తీయించి, పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ ఘటనపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

సిరిసిల్ల అర్బన్ బ్యాంకులో నామినేషన్ల సందడి

- మొదటి రోజు 23 నామినేషన్లు దాఖలు

9వ డివిజన్ నుంచి నామినేషన్ దాఖలు చేస్తున్న అర్బన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ బొడ్డుల భాస్కర్

రాజన్న సిరిసిల్ల, మే 27 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు పోరుకు సమయం దగ్గరపడుతున్నది. వచ్చే నెల 6న ఎన్నికలు జరుగనుండగా సోమవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. బ్యాంకు పరిధిలో 12 డివిజన్లుండగా, డైరెక్టర్ స్థానాలకు తొలి రోజు 23 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి రామకృష్ణ తెలిపారు. 12 డివిజన్లలో 8 డివిజన్లకు మాత్రమే నామినేషన్లు దాఖలయ్యాయి. 2,4,7,8 డివిజన్ల నుంచి ఒక్కటీ దాఖలు కాలేదు. 10వ డివిజన్ నుంచి ఒకే ఒక్క నామినేషన్ దాఖలు కాగా, 9వ డివిజన్‌లో అత్యధికంగా 7 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 28, 29వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనున్నది.

వాణిజ్య

సామ్‌సంగ్ సరికొత్త గెలాక్సీ ఫోన్లు

ప్రారంభ ధర రూ.26,999

న్యూఢిల్లీ, మే 27: సరికొత్త స్మార్ట్‌ఫోన్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది సామ్‌సంగ్ సంస్థ. గెలాక్సీ సిరీస్‌లో భాగంగా విడుదల చేసిన ఎఫ్55 5జీ వ్యాగన్ లెదర్ డిజైన్, 6.7 ఇంచుల ఫుల్ హెచ్‌డీ+ సూపర్ అమోలెడ్ డిస్‌ప్లే, శక్తివంతమైన స్నాప్‌డ్రాగన్ ప్రాసెసర్‌తో ఈ మొబైల్‌ను తీర్చిదిద్దింది. 8జీబీ+128జీబీ మెమొరీ కలిగిన మాడల్ ధర రూ.26,999 కాగా, 8జీబీ+256 జీబీ మాడల్ రూ.29,999, అలాగే 12జీబీ+256 జీబీ మాడల్ రూ.32,999గా నిర్ణయించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ కార్డులపై కొనుగోలు చేసిన వారికి రూ.2 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్ కల్పిస్తున్నది. 45 వాట్ల సూపర్-ఫాస్ట్ చార్జింగ్, ఆండ్రాయిడ్ అప్‌గ్రేడ్, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా సామ్‌సంగ్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజు పుల్లన్ మాట్లాడుతూ..దేశం కోసం దేశీయంగా తయారైన ఈ ఎఫ్55 5జీ స్మార్ట్‌ఫోన్ కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టుగా, ముఖ్యంగా యువతను దృష్టిలో పెట్టుకొని డిజైన్ చేసినట్లు చెప్పారు.

4 నెలలు.. 1,762 కోట్లు

రకరకాల ట్రేడింగ్ స్కాముల్లో పెద్ద ఎత్తున మోసపోతున్న మదుపరులు

- *గత ఏడాది దేశవ్యాప్తంగా లక్షకుపైగా ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్ కేసులు నమోదు*
- *రోజూ మోసాలపై 7వేలకుపైగా వస్తున్న ఫిర్యాదులు. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా 7,40,957 కేసులు*
- *గత కొన్నేండ్లుగా పెరుగుతూపోతున్న డిజిటల్ మోసాలు. 2019లో 26,049గా ఉన్న కేసులు.. 2023లో 15,56,215కు చేరిక.*

ఈ ఏడాది జనవరి-ఏప్రిల్‌లో సైబర్‌క్రైమ్‌లు

కేసులు	నేరం	నష్టం (రూ.కోట్లలో)
20,043	ట్రేడింగ్ కుంభకోణాలు	1,420
62,687	పెట్టుబడి స్కాములు	222
4,599	డిజిటల్ మోసాలు	120

ముంబై, మే 27: అమాయకులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు మోసాలకు తెగబడుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు నమోదైన వివిధ సైబర్‌క్రైమ్ కేసుల్లో ఇన్వెస్టర్లు రూ.1,762 కోట్లు నష్టపోయినట్టు ఇండియన్ సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (14సీ) వివరాలు చెప్తున్నాయి. ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ మోసం, గేమింగ్ యాప్స్, అల్గరిథమ్ అక్రమాలు, చట్టవిరుద్ధమైన రుణ యాప్‌లు, ఓటీపీలను ఇతరులకు పంపడం వంటి వాటిల్లో బాధితులు ఎక్కువగా ఉన్నట్టు తేలింది. తాజాగా నవీ ముంబైలోని ఖర్ఘర్ టౌన్‌షిప్‌కు చెందిన ఓ 48 ఏండ్ల వ్యక్తి కూడా షేర్ ట్రేడింగ్ కుంభకోణంలో చిక్కుకుని రూ.1.07 కోట్లు మోసపోయాడు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతుండగా, పోలీసులు 15 మందిపై 420సహా వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వీరిలో ఓ యాప్, వెబ్‌సైట్ ఓనర్లు కూడా ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి మే 5 వరకు బాధితుడిని మోసగాళ్లు పలుమార్లు కలిశారని, షేర్ ట్రేడింగ్ నుంచి ఆకర్షణీయమైన లాభాలను ఇప్పిస్తామని నమ్మబలికారని నవీ ముంబై సైబర్ పోలీస్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ గజానన్ కదమ్ తెలిపారు. ఈ క్రమంలోనే వివిధ బ్యాంక్ ఖాతాల్లో పెట్టుబడిగా 1,07,09,000 రూపాయలను డిపాజిట్ చేయించుకున్నారన్నారు. అయితే ఆ తర్వాత వారి నుంచి ఎలాంటి స్పందన లేదని, దీంతో మోసపోయానని గుర్తించిన బాధితుడు ఫిర్యాదు చేశాడని గజానన్ వివరించారు.

మోసపోతున్నాం ఇలా..

సైబర్ నేరగాళ్లు ఫలానా బ్యాంక్ లేదా దర్యాప్తు ఏజెన్సీల నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి మోసాలకు పాల్పడుతున్నారు. సీబీఐ, ఎన్ఐఏ, ఈడీ, ఆర్బీఐల అధికారులమంటూ అమాయకులను భయపెట్టి, నమ్మించి బురిడీ కొట్టిస్తున్నారు. తమ ఖాతాల్లోకి భారీగా నగదును బదిలీ చేసేసుకుంటున్నారని వివిధ కేసుల్లో దర్యాప్తు అధికారులు చెప్తున్నారు. కాగా, గత 4 నెలల్లో 3.25 లక్షల బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేసిన అధికారులు.. మరో 5.3 లక్షల సిమ్ కార్డులను బ్లాక్ చేశారు. 3,401 సోషల్ మీడియా అకౌంట్లనూ డీఆక్టివేట్ చేశారు. ఆగ్నేయాసియా దేశాల్లోని వివిధ ప్రాంతాలను కేంద్రంగా చేసుకొని భారత్‌ను సైబర్ మోసగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నారని 14సీ సీఈవో రాజేశ్ కుమార్ తెలిపారు. వీటిలో కంబోడియా, థాయిలాండ్, మయన్మార్ దేశాలున్నట్టు చెప్పారు.

రిటైల్లోకి అపర్ణ

284 కోట్లతో హైదరాబాద్‌లో షాపింగ్ మాల్

హైదరాబాద్, మే 27: ప్రముఖ రియల్టీ సంస్థ అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్..తాజాగా రిటైల్-కమర్షియల్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలోకి అడుగుపెట్టింది. ఇందు కోసం రూ.284 కోట్లతో హైదరాబాద్‌లో అపర్ణ నియో షాపింగ్ మాల్, అపర్ణ సినిమాస్ పేర్లతో ప్రత్యేక వ్యాపారాన్ని ఆరంభించింది. నల్లగండ్ల వద్ద 3.67 ఎకరాల స్థలంలో 3.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో షాపింగ్ మాల్‌ను నెలకొల్పింది. వీటిలో రూ.252 కోట్లను అపర్ణ నియో షాపింగ్ మాల్ కోసం ఖర్చు చేసిన సంస్థ..మరో రూ.32 కోట్లతో అపర్ణ సినిమాస్‌ను తీర్చిదిద్దింది. అలాగే వ్యాపార విస్తరణలో భాగంగా 2027 నాటికి తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లలో నాలుగు మాల్స్‌ను నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం సంస్థ తెలంగాణతోపాటు ఏపీ, కర్ణాటకల్లో 77 ప్రాజెక్టులను నిర్మించింది. వీటిలో 66 రెసిడెన్షియల్ ప్రాపర్టీలు కాగా, మరో 11 కమర్షియల్ అండ్ రిటైల్ రంగానికి చెందినవి.

సెన్సెక్స్ @ 76,000

- ఇంట్రా-డేలో తొలిసారి తాకిన సూచీ
- నిఫ్టీ సైతం ఆల్‌టైమ్ హైని చేరి దిగువకు పతనం
- స్వల్ప నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు
- లాభాల స్వీకరణకు దిగిన మదుపరులు

ముంబై, మే 27: తీవ్ర ఒడిదొడుకుల నడుమ దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం స్వల్ప నష్టాలను చవిచూశాయి. ఉదయం ఆరంభం నుంచే లాభాల్లో పరుగులు పెట్టిన సూచీలు.. మునుపెన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలను చేరాయి. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ తొలిసారి 76,000 పాయింట్లను తాకింది. ఒకానొక దశలో 599.29 పాయింట్లు ఎగిసి గరిష్ఠంగా 76,009.68 వద్దకు వెళ్లి ఆల్‌టైమ్ ఇంట్రా-డే హైని నెలకొల్పింది. ఇదే సమయంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 153.70 పాయింట్లు ఎగబాకి 23,000 మార్కును మరోసారి అధిగమించి, మొదటిసారి 23,110.80 స్థాయిని టచ్ చేసింది. అయితే మదుపరులు ఒక్కసారిగా లాభాల స్వీకరణకు దిగారు. దీంతో సూచీలు క్రమేణా పడిపోతూ నష్టాలకు లోనయ్యాయి. చివరకు సెన్సెక్స్ 19.89 పాయింట్లు తగ్గి 75,390.50 వద్ద, నిఫ్టీ 24.65 పాయింట్లు దిగి 22,932.45 వద్ద స్థిరపడ్డాయి. ఇక సెన్సెక్స్ గరిష్ఠ స్థాయి నుంచి దాదాపు 835 పాయింట్లు క్షీణించగా, నిఫ్టీ 250 పాయింట్లు పతనమైంది. సెన్సెక్స్ కనిష్ఠ స్థాయి 75,175.27గా, నిఫ్టీ కనిష్ఠం 22,870గా ఉన్నది. కాగా, సెన్సెక్స్ తొలిసారి 75,000 మార్కును గత నెల ఏప్రిల్ 9న తాకింది. దీంతో గడిచిన 31 ట్రేడింగ్ రోజుల్లో 1,000 పాయింట్లు పెరిగినట్టైంది. అంతకుముందైతే 74,000 నుంచి 75,000 స్థాయికి 21 ట్రేడింగ్ సెషన్లే పట్టింది. ఇదిలావుంటే బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఐటీ, ఆయిల్, ఎనర్జీ, ఎఫ్ఎంసీజీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మార్కెట్ హెవీ వెయిట్ షేరైన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ షేర్ విలువ దాదాపు 1 శాతం తగ్గడం ఓవరాల్ ట్రేడింగ్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేసినట్టు మెజారిటీ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఐటీసీ షేర్ల పతనం కూడా దెబ్బతీసింది. ఇక వచ్చే వారం (జూన్ 4న) లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఉండటంతో మదుపరులు ఒకింత భయాందోళనలకు గురవుతున్నారని, ఇందుకు మార్కెట్ ఒడిదొడుకులే తాజా ఉదాహరణ అని మరికొందరు ఎక్స్‌పర్ట్స్ ట్రేడింగ్ సరళిని అభివర్ణిస్తున్నారు. సెన్సెక్స్‌లో విప్రో, ఎన్టీపీసీ, సన్ ఫార్మా, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐటీసీ, ఆర్ఐఎల్ షేర్లు భారీగా నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలూ 0.63 శాతం, 0.09 శాతం చొప్పున క్షీణించాయి.

తగ్గనున్న ఎన్ఎస్ఈ టిక్ సైజ్

రూ.250 కంటే తక్కువ ధర కలిగిన అన్ని స్టాక్స్‌కు ఒక పైసా టిక్ సైజ్‌ను పెట్టాలని ఎన్ఎస్ఈ నిర్ణయించింది. జూన్ 10 నుంచి ఈ మార్పు అమల్లోకి రానున్నది. ఇంతకుముందు ఇది 5 పైసలుగా ఉండేది. ద్రవ్యతను పెంచడం, ధర అన్వేషణను మెరుగుపర్చడంలో భాగంగానే ఆయా షేర్లకు టిక్ సైజ్‌ను తగ్గిస్తున్నట్టు ఎన్ఎస్ఈ ఓ సర్క్యులర్‌లో పేర్కొన్నది. టిక్ సైజ్‌లు అనేవి ప్రతీ నెల చేసే సర్దుబాట్లు, సమీక్షలకు లోబడి ఉంటాయి. ప్రతీ నెల చివరి ట్రేడింగ్ రోజు ముగింపు ధరలపై ఆధారపడి ఉంటాయి. గత ఏడాది బీఎస్ఈ కూడా రూ.100 కంటే తక్కువ ధర కలిగిన అన్ని స్టాక్స్‌కు టిక్ సైజ్‌ను 5 పైసల నుంచి 1 పైసాకు తగ్గించింది.

ఎన్ఎండీసీ ప్రాఫిట్ డౌన్

న్యూఢిల్లీ, మే 27: ఖనిజ ఉత్పత్తిలో అగ్రగామి సంస్థయైన ఎన్ఎండీసీ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చి త్రైమాసికానికిగాను రూ.1,415.62 కోట్ల నికర లాభాన్ని గడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో నమోదైన రూ.2,276.94 కోట్ల లాభంతో పోలిస్తే 38 శాతం తగ్గింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.5,842.52 కోట్ల నుంచి రూ. 6,908.37 కోట్లకు ఎగబాకింది. నిర్వహణ ఖర్చులు పెరగడం వల్లనే లాభాల్లో గండి పడిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

ఆర్బీఐ డివిడెండ్ ప్రభావం పరిమితమే

ఫిచ్ రేటింగ్స్ అంచనా

న్యూఢిల్లీ, మే 27: కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవల ప్రకటించిన డివిడెండ్ ప్రభావం.. ప్రభుత్వ రుణ భారం, లోటు తగ్గింపులపై పరిమితంగానే ఉండొచ్చని ప్రముఖ గ్లోబల్ రేటింగ్స్ ఏజెన్సీ ఫిచ్ రేటింగ్స్ అభిప్రాయపడింది. గత ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను మునుపెన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్‌ను ఆర్బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. బడ్జెట్ అంచనా కన్నా ఇది రెట్టింపునకుపైగా ఉండటం గమనార్హం. కాగా, దేశ జీడీపీలో ఈ డివిడెండ్ 0.6 శాతానికి సమానమని ఫిచ్ తెలిపింది.

ఎల్ఐసీ లాభం 13,763 కోట్లు

జీతాల పెంపుతో లాభాల వృద్ధికి బ్రేక్

న్యూఢిల్లీ, మే 27: దేశీయ బీమా దిగ్గజం ఎల్ఐసీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.13,763 కోట్ల నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇ